# అబ్రాహాముతో మెస్సీయాను గూర్చిన నిబంధన

ఆదికాండం 22:18లో దేవుడు అబ్రాహామునకు యిలా వాగ్దానం చేశాడు: "మరియు నీవు నా మాట వినినందున భూలోకములోని జనములన్నియు నీ సంతానమువలన ఆశీర్వదించబడును ..." గలతీ. 3:16లో, ఈ వాగ్దానం క్రీస్తును గూర్చినదని పౌలు యిలా సూచించాడు: "–అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు –'సంతానములకును' అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే –'నీ సంతానమునకును' అనెను; ఆ సంతానము క్రీస్తు."

అటు హెబ్రీలోను యిటు గ్రీకులోను గలతీ. 3:16ను పౌలు తప్పుగా ప్రయోగించినట్టు కొందరు అతని మీద నేరం మోపారు. ఎందుకంటే, బైబిల్లో ఈ రెండు పదాలు కూడా బహు వచనంలోనే ఉపయోగింపబడ్డాయని వారి నమ్మకం. అయితే యిది నిజం కాదు. "సంతానం" అనే దానికి *zera* అనే హెబ్రీ పదం గాని, దానికి సమానమైన గ్రీకు పదం *sperma* గాని, రూపంలో ఏకవచనంగాను, అర్థంలో మొత్తంగా ఏర్పడిందిగాను ఉండవచ్చు. అందువలన ఈ పదాలు ఏకవచనాలుగా ఉండవచ్చు, బహు వచనంగా ఉండవచ్చు. ఎక్కువ సందర్భాల్లో, సందర్భానుసారంగా కాని లేక ఉపయోగించే వ్యక్తి ననుసరించి కాని దాని భావం తీర్మానించబడుతుంది.

పాత నిబంధనలో *zera* అనే హెబ్రీ పదం బహు తరచుగా బహు వచనంలోనే వినియోగింపబడినా, కొన్ని లేఖన భాగాల్లోనైతే, *zera* అనే పదం ఏకవచనంలోనే ఉపయోగించ సాధ్యపడుతుంది. ఉదాహరణకు, ఆది. 4:25; 15:3; 21:13; మరియు 1 సమూ. 1:11లను చూడు.

*zera* అనే పదం "సంతతివాడు," లేక "బిడ్డ" అని తర్జుమా చేయబడింది, ఆ లేఖన భాగాల్లో ఏకవచనంగానే తీసికొన వీలుంటుంది. అలాగే *sperma* అనే గ్రీకు పదం తరచుగా బహు వచనమైనా, ఏకవచనంగా కూడా ఉండవచ్చు. మత్తయి 22:25లోని "సంతానము" (*sperma*) అనేది ఒకటి లేక అంతకంటె ఎక్కువ మంది పిల్లలుగా గ్రహించవచ్చు. మార్కు 12:20–22ల్లో కూడా అదే విషయం, మార్కు 12:19 ప్రత్యేకించి ("పిల్లలు" అని తెలుగులో ఉన్నా) "బిడ్డ లేనందున" అని (ఏక వచనంలో) ఉంది.

పాత, క్రొత్త నిబంధనలనే రెండింటిలోను, "సంతతి" అనే పదాలకు ఏకవచనం ఉండవచ్చు. అయితే యిదే వాటి తరచైన భావమనే అర్థం కాదు. అయితే అవి అలా ఉపయోగించబడినందున, ఆది. 22:18లో దేవుడు "ఒకనిని" గూర్చియే మాట్లాడిన

సంగతిని పౌలు అపార్థం చేసికోలేదని, ఏకవచనం ఉపయోగించింది కేవలం క్రీస్తును సూచించడానికి మాత్రమేననేది వాస్తవం. ఆ మాట పలికిన దేవునికి మాత్రమే ఆయన ఏకవచనం ఉపయోగించాడో, బహువచనం ఉపయోగించాడో తెలుస్తుంది. ఏమైనా కాని, దేవుని ఆత్మ అపొస్తలుడైన పౌలును నడిపిస్తున్నాడు (1 కొరింథీ. 7:40); గనుక, ఆత్మ ద్వారా, "సంతానము" అనే పదాన్ని దేవుడు ఎలా ఉపయోగించాడో పౌలుకు తెలుసు. అబ్రాహాము సంతతిలోని ఒకని ద్వారా దేవుడు లోకాన్ని ఆశీర్వదించుతానని వాగ్దానం చేశాడేగాని, అనేకుల ద్వారా ఆశీర్వదించుతానని ఎంత మాత్రం కాదు.

అబ్రాహాము యొక్క సంతానంలో ఒక్కని ద్వారా భూలోకమందలి కుటుంబాలన్నిటిని ఆశీర్వదిస్తానని చేసిన ఈ ఒడంబడిక, దేవుని గొప్ప నిబంధనలలో ఒకటైయుంది. ఆ వాగ్దానమందు భూలోకమందలి సమస్త కుటుంబాలు చేర్చబడినందున, కేవలం దీని పైననే యూదుల నిరీక్షణయు ఆధారపడియుంటుంది. ఆ ప్రతిపాదన తమకే చెందినట్లు యూదా జనాంగం భావించింది – వారు దేశంగా లోకంలో ప్రతి ఒక్కరిని ఆశీర్వదిస్తామని తలంచారు. అయితే, దానికి మారుగా, తన ప్రియ కుమారుడైన యేసు క్రీస్తును సూచించడానికి దేవుడు ఉద్దేశించాడు. ఆయన ద్వారా దేవుడు లోకంలోని అన్ని కుటుంబాలవారికి ఆశీర్వాదం అనుగ్రహించాలని కోరుకున్నాడు. అబ్రాహాముకు దేవుడు యిచ్చిన ఈ వాగ్దానం మీద ఆధారపడి దేవుని ఆశీర్వాదం పొంద నిరీక్షిస్తున్నాం.

అబ్రాహాము దేవుని మాట విన్నాడు (ఆది. 22:18). మనం అలా చేసినట్టయితే మనం కూడా ఆశీర్వదింపబడతాం. మన నిత్య రక్షణకు కారకుడైన క్రీస్తు యేసుకు లోబడడం ద్వారా మనం దేవుని అనుసరించాలి (హెబ్రీ. 5:9). "అబ్రాహాము విశ్వాసం వంటి విశ్వాసం" కలవారమై మనముండాలి (రోమా 4:16).